రుణం చెల్లిస్తేనే కొత్త రుణమా?

రుణమాఫీ హామీని మరిచారా సీఎం గారు? • అధికారం దక్కగానే హామీలన్నీ తొక్కేశారా?

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మూల్యం తప్పదు • బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ట్వీట్

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరగానే డిసెంబర్ 9న రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న హామీ అటకెక్కినట్టేనా? అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నిలదీశారు. రైతులకు పెట్టుబడి సాయంగా కొత్త రుణాలు కావాలంటే, పాత అప్పు చెల్లించాల్సిందేనని బ్యాంకర్లు రైతులను వేధిస్తున్నారని గురువారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారు.. మీకు డిసెంబర్ 9 గుర్తుందా? లేదా? అధికారం మత్తులో మునిగి, ప్రతిపక్ష ఎమ్మెల్యేల కొనుగోలులో పడి ఆ తేదీ, రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీ మరిచిపోయారా? అధికారం దక్కగానే ప్రజలకిచ్చిన హామీలన్నీ 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, వాటిని తుంగలో తొక్కుతున్న కాంగ్రెస్ సర్కారు వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మూల్యం చెల్లించుకోక తప్పదు' అంటూ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు.

ఒక ఫ్యూడల్ భూస్వామ్య కులం చెరబట్టింది

స్వాతంత్ర్యాన్ని తెచ్చి జాతిని విముక్తం చేసిన మూడురంగుల జెండాను నేడు ఒక తెలంగాణ ఫ్యూడల్ భూస్వామ్య కులం చెరబట్టిందని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. బక్క జడ్సన్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించడంపై ఆయన ఎక్స్ వేదికగా గురువారం స్పందించారు. 'జడ్సన్ రాయని కవిత'ను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'నాడు ద్రౌపదిని వస్త్రాపహరణం చేసిన చేతులే, నేడు అన్యాయమని ఎలుగెత్తిన గొంతులను బహిష్కరిస్తున్నాయి. తస్మాత్ జాగ్రత్త... తగిన మూల్యం చెల్లించుకుంటారు?' అని హెచ్చరించారు. 'కాంగ్రెస్‌లో ఇంకా సామాజిక న్యాయం మిగిలి ఉందని నమ్మి అందులో బందీలైన కొంత మంది అమాయక ప్రాణులకు, అజ్ఞాన మేధావులకు ఈ కవిత కనువిప్పు కలిగిస్తుందనుకుంటా' అని పేర్కొన్నారు. 'ఒక బక్కోడైన బక్క జడ్సన్‌ను మీరు బహిష్కరించినమని సంబుర పడుతుర్రేమో.. మీరు గెంటివేసింది ముక్కోటి తెలంగాణ బహుజన ఆత్మలను, మీరు బహిష్కరించింది, మీకు అధికారం కట్టబెట్టిన సబ్బండవర్గాల తన్లాటను, రూమీ టోపీ నుంచి గాంధీ టోపీ దాకా ఆ నుంచి ఏ ఎండ కాగొడుగు పట్టేదాకా సాగిన మీ ప్రయాణం కూచున్న కొమ్మనే నరికేసుకొనే మీ దుర్మార్గానికి తెగబడ్డది.. బాయిల బడ్డ కుక్క తీయబోయిన కరుసొస్తదట.. అట్లున్నది మీ అభ్రద్రత.. మీ కబంధ హస్తాల్లో చిక్కిన కాంగ్రెస్‌ను ఎవ్వడూ కాపాడలేడిప్పుడూ' అంటూ ఉన్న కవితను ప్రవీణ్ పోస్టు చేశారు.

ఇక నిర్ణయించాల్సింది ప్రజలే...

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి మెజారిటీ ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ కీలక నేతలు బహిరంగంగానే చెప్తున్నారని ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. నాగౌర్ లోక్‌సభ స్థానం బీజేపీ అభ్యర్థి జ్యోతి మిర్ధా చేసిన వ్యాఖ్యల వీడియోను ట్యాగ్‌చేస్తూ ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. బీజేపీ వాళ్లకు ఓటు వేసి మనం చీకటియుగంలోకి పోవాలో లేదో నిర్ణయించుకోవాల్సింది దేశ ప్రజలేనని సూచించారు.

రెన్యువల్ చేస్తేనే.. కొత్త రుణాలు

పంట రుణాలపై బ్యాంకుల మెలిక

బకాయిలు చెల్లిస్తేనో, రెన్యువల్ చేస్తేనో కొత్త రుణాలు ఇస్తామని అధికారుల కండిషన్

వానకాలం పంట రుణాలు ఈసారి గగనమే

రుణమాఫీ కోసం రైతుల ఎదురుచూపులు

హైదరాబాద్, ఏప్రిల్ 3(నమస్తే తెలంగాణ): 'మేం అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణం మాఫీ చేస్తాం. రైతులంతా బ్యాంకులకు వెళ్లి రుణాలు తెచ్చుకోండి' ఇదీ ఎన్నికల ప్రచారంలో రైతులకు రేవంతోరెడ్డి ఇచ్చిన హామీ. రేవంత్‌రెడ్డి ఆశించినవిధంగా డిసెంబర్ 9న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కానీ, డిసెంబర్ 9న రైతుల రుణం మాత్రం మాఫీ కాలేదు. డిసెంబర్ 9 దాటిపోయి నాలుగు నెలలవుతు

- గుట్ట దిగితేనే గుక్కెడు నీళ్లు

బావి నీళ్ల కోసం గుట్ట దిగి నెత్తిన బిందెతో మళ్లీ గుట్టక్కెతున్న వీళ్లంతా సిర్పూర్(యు) మండలంలోని చోర్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పూనగూడ గ్రామస్థులు. 15 ఆదివాసీ ఇండ్లు మాత్రమే ఈ గ్రామానికి కేసీఆర్ ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా పైపులైన్‌ను వేసి నీళ్లిచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఈ పైపులైన్‌లో నీళ్లు రాకపోవడంతో అరకిలోమీటర్ కాలినడకన వెళ్తూ ఇలా పానీపాట్లు పడుతున్నారు.

- కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/ సిర్పూర్(యు), ఏప్రిల్ 4

పంట నష్టం 3 వేల కోట్లు!

రైతుల రెక్కల కష్టం కరువుపాలు

భారీ పెట్టుబడులతో పంటల సాగు

- సాగునీరు లేక ఎండిపోతున్న పంటలు
- ఇప్పటికే 15 లక్షల ఎకరాల్లో ఎండిన పంటలు
- ఎకరాకు కనీసం రూ.20 వేల మేరకు నష్టం
- పంట నష్టంపై స్పందించని రాష్ట్ర సర్కారు
- అకాలవర్షాలతో పంటల నష్టంపైనా మొద్దునిద్ర
- ఆర్థికంగా కుంగిపోయి.. అన్నదాతల ఆక్రందనలు

హైదరాబాద్, ఏప్రిల్ 4(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వ అలసత్వం, అసమర్థ పాలన మూలంగా రాష్ట్రంలో రైతులకు భారీ నష్టాలను మిగిల్చింది. సాగునీరు ఇవ్వడంలో సర్కారు వైఫల్యంతో రైతుల రెక్కల కష్టం, పెట్టుబడి కరువుపాలు అవుతున్నది. ఈ యాసంగి సీజన్‌లో ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి పండించిన పంటలు కండ్లముందే ఎండిపోతుంటే, రైతులు కన్నీరు కారుస్తూ నష్టాలను మూటగట్టుకుంటున్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా సాగునీళ్లు లేక చేతికొచ్చిన పంటలు ఎండిపోతున్న దారుణ పరిస్థితులే కనిపిస్తున్నాయి. చెరువుల్లో, కుంటల్లో, కాలువల్లో నీళ్లు ఇంకిపోతే.. రైతు కండ్లల్లో మాత్రం కన్నీటిధారలు పారుతున్నాయి. గత యాసంగి మాదిరిగానే మంచి పంట చేతికొస్తదని, పైసలొస్తాయని భావించిన రైతులకు సాగు పెట్టుబడులు మీదపడే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో రైతులు ఆర్థిక ఇబ్బందులతో అప్పుల పాలయ్యే దుర్భర పరిస్థితులు దాపురించాయి.

15 లక్షల ఎకరాల్లో ఎండిన పంటలు

ఈ యాసంగి సీజన్‌లో వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం 67.55 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో అత్యధికంగా వరి 51.71 లక్షల ఎకరాల్లో సాగైంది. మొత్తం సాగైన పంటలో ఇప్పటికే సుమారు 15 నుంచి 20 శాతం పంటలు ఎండిపోగా మరింత విస్తీర్ణంలో ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా ఉమ్మడి నల్లగొండ, కరీంనగర్, వరంగల్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉన్నది. ఎస్సారెస్పీ పరిధిలో కాలువ, బోర్లు కలిపితే సుమారు 20 లక్షల ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. సాగర్ ఎడమ కాలువ కింద 6 లక్షల వరకు ఉంటుంది. ఈ రెండు నీటి వనరుల పరిధిలోనే 30 నుంచి 40 శాతం పంటలు ఎండపోయినట్టు అంచనా. ఈ విధంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పంటలు కలిపి ఇప్పటివరకు సుమారు 15 లక్షల ఎకరాల వరకు ఎండిపోయినట్టు సమాచారం. సాగునీటి కొరతతోపాటు ఇటీవల కురిసిన వడగండ్ల వర్షాలు కూడా రైతులకు నష్టాలే మిగిల్చాయి.

ఎండిన పంటలతో 3 వేల కోట్ల నష్టం

రాష్ట్రవ్యాప్తంగా ఎండిన పంటల కారణంగా రైతులకు సుమారు రూ.3,000 కోట్ల మేరకు నష్టం వాటిల్లినట్టు అంచనా వేస్తున్నారు. దున్నకం, నాటు కూలీలు, ఎరువులు, విత్తనాలు, కలుపు మందు ఇలా అన్నీ కలిపి ఒక ఎకరం వరి సాగుకు రూ.30 వేల వరకు పెట్టుబడి ఖర్చు అవుతుంది. ఈ దశలో పంటలు ఎండిపోవడంతో వరి కోతలు, ఆ తర్వాత ఖర్చులు మినహాయిస్తే ఎకరానికి కనీసంగా రూ.20 వేల వరకు పెట్టుబడి ఖర్చు అవుతుంది. రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షల ఎకరాల్లో జరిగిన నష్టానికి రూ.3 వేల కోట్ల వరకు నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు. మే మొదటివారం వరకు సాగునీటి కొరత తీవ్రమైతే మరింత విస్తీర్ణంలో పంటల నష్టంవాటిల్లే ప్రమాదమున్నదని వ్యవసాయ శాఖ వర్గాలు అంచనా.

రైతుల రోదనలు.. పట్టని సర్కారు

పంటలు ఎండిపోవడంతో రైతులు గుండెలు పగిలేలా రోదిస్తున్నారు. పెట్టిన పెట్టుబడి నష్టపోయి అప్పులపాలయ్యామంటూ ఆందోళన చెందుతున్నారు. ఈ సమయంలో ఆపన్నహస్తం అందించాల్సిన సర్కారు పట్టించుకోవడం లేదనే రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటి వరకు రైతులను ఆదుకునే దిశగా కనీస చర్యలు చేపట్టకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎండిన పంటలపై కనీసం సర్వే కూడా చేయకపోవడం గర్హనీయం. ప్రభుత్వం నుంచి వ్యవసాయ శాఖకు ఎలాంటి ఆదేశాలూ అందలేదు. దీంతో అధికారులు కూడా ఎండిపోయిన పంటలపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం కండ్లు తెరిచి పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని రాష్ట్రవ్యాప్తంగా డిమాండ్లు వస్తున్నాయి.

వడగండ్ల పరిహారంపై అతీగతీ లేదు

గత నెలలో అకాలవర్షాలతో నష్టపోయిన పంటల పరిహారానికి ఇప్పటివరకు అతీగతీ లేదు. సర్వే చేస్తున్నాం, బాధిత రైతులకు ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇస్తామంటూ ప్రభుత్వం, మంత్రులు ప్రకటించారు. కానీ నెల రోజులు గడుస్తున్నా పరిహారంపై మళ్లీ నోరు మెదపడం లేదు. జిల్లాల వారీగా పంట నష్టంపై సర్వే చేసిన వ్యవసాయ శాఖ ఆ నివేదికను ఇప్పటికే ప్రభుత్వానికి పంపించినట్టు తెలిసింది. అయినా ప్రభుత్వం మాత్రం పరిహారం ఇవ్వడంపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం. అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పరిహారంపై ప్రకటనకు ఇబ్బందులున్నాయనే వాదన ప్రభుత్వం నుంచి వినిపిస్తున్నది. అయితే ఇందుకు పరిష్కారంగా ప్రభుత్వం ఎన్నికల సంఘానికి లేఖ రాసి అనుమతి తీసుకోవచ్చు. కానీ ప్రభుత్వం ఆ ప్రయత్నమే చేయడం లేదు. ఇప్పటికైనా సర్కారు ఆప్రయత్నం చేయాలని వివిధ వర్గాలు కోరుతున్నాయి.

67.55
ఈ యాసంగి సీజన్‌లో రాష్ట్రంలో 67.55 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి.

51.71
రాష్ట్రవ్యాప్తంగా 51.71 లక్షల ఎకరాల్లో వరి పంట సాగయింది.

20
ఎస్సారెస్పీ పరిధిలో కాలువలు, బోర్లు కలిపితే సుమారు 20 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది.

6
సాగర్ ఎడమ కాలువ కింద 6 లక్షల వరకు ఆయకట్టు ఉంది.

15
రాష్ట్రంలో అన్ని పంటలు కలిపి ఇప్పటివరకు సుమారు 15 లక్షల ఎకరాల వరకు ఎండిపోయినట్టు సమాచారం.

3,000
రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షల ఎకరాల్లో జరిగిన నష్టానికి రూ.3,000 కోట్ల వరకు నష్టం వాటిల్లిందని అంచనా.

ట్రిబ్యునల్ విచారణ వాయిదా వేయాలి : ఏపీ

హైదరాబాద్, ఏప్రిల్4 (నమస్తే తెలంగాణ): ఎన్నికల నేపథ్యంలో ఎస్‌వోసీ (స్టేట్‌మెంట్ ఆఫ్ కేస్)ను దాఖలు చేయలేకపోతున్నామని, ఈ నేపథ్యంలో విచారణను వాయిదా వేయాలని బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కు ఏపీ సర్కారు విజ్ఞప్తి చేసింది. తెలంగాణ, ఏపీ మధ్య కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ ఈ నెల 8 నుంచి ఢిల్లీలో ప్రారంభం కావాల్సి ఉన్నది. 1956లోని సెక్షన్3 ప్రకారం విచారణ చేపట్టాల్సిన అంశాలపై తెలంగాణ ఇరిగేషన్ అధికారులు ఇప్పటికే స్టేట్‌మెంట్ ఆఫ్ కేస్ (ఎస్‌వోసీ)ను దాఖలు చేశారు. ఏపీ ప్రభుత్వం మాత్రం ఇప్పటివరకు దాఖలు చేయలేదు. తాజాగా ఎస్‌వోసీ దాఖలుకు ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారిందని, ఈ నేపథ్యంలో మరింత గడువు ఇవ్వాలని కోరుతూ ట్రిబ్యునల్‌కు ఏపీ విజ్ఞప్తి చేసింది.

త్రీమెన్ కమిటీ సమావేశం 12కు వాయిదా

హైదరాబాద్, ఏప్రిల్4 (నమస్తే తెలంగాణ): కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) గురువారం నిర్వహించ తలపెట్టిన త్రీమెన్ కమిటీ సమావేశం 12కి వాయిదా పడింది. శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్లలోని నీటి వినియోగానికి సంబంధించి ఇరు రాష్ట్రాల ఈఎన్సీలతో, బోర్డు మెంబర్ సెక్రటరీతో కూడిన త్రీమెన్ కమిటీ సమావేశం బోర్డు బుధవారం ఏర్పాటైంది. సమావేశానికి ఇరు రాష్ట్రాల ఈఎన్సీలు హాజరుకాలేదు. తెలంగాణ రాష్ట్ర ఈఎన్సీ అనిల్‌కుమార్ వ్యక్తిగత కారణాలతో సెలవుపెట్టారు. మరో రోజుకు సమావేశం వాయిదా వేయాలని బోర్డుకు లేఖరాశారు. ఏపీ కూడా సమావేశాన్ని 10 తరువాత నిర్వహించాలని తెలుపుతూ ఇప్పటికే లేఖ రాసింది.

పవర్‌ఫుల్ లేజర్

హైదరాబాద్ కేంద్రంగా అభివృద్ధి చేసిన టీఐఎఫ్ఆర్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): ఎలక్ట్రానిక్స్, భౌతిక శాస్త్ర అవసరాలకు అనువైన ఆధునాతన లేజర్ టెక్నాలజీని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్ (టీఐఎఫ్ఆర్) అభివృద్ధి చేసింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు దీటుగా పనిచేస్తూ, అతి తక్కువ కాలంలో శక్తిమంతమైన కాంతి తరంగాలను విడుదల చేసేలా దీన్ని తయారుచేశారు. టేబుల్‌టాప్ లేజర్ సిస్టంగా పిలిచే ఈ విధానం ద్వారా భారీ మొత్తంలో ఎలక్ట్రానిక్ తరంగాలను ప్రసారం చేయడానికి ఆస్కారం ఉంటుందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఇది అతి వేగంతో ప్రయాణిస్తూ ఎలక్ట్రానిక్ రంగంలో విప్లవాత్మకంగా మారుతుందని వెల్లడించారు. సాధారణ ఎలక్ట్రాన్లను క్షణాల్లో మెగా ఎలక్ట్రానిక్ వోల్ట్‌గా రూపాంతరం చేయగలదని వివరించారు. ఈ లేజర్ టెక్నాలజీని సులభంగా వినియోగించవచ్చు. నిర్వహణ వ్యయం కూడా తక్కువ. మైక్రోస్కోపిక్ అధ్యయనాల్లోనూ కీలకంగా మారనున్నది.

కాళేశ్వరం ప్రాజెక్టుపై న్యాయవిచారణ

- వారంలో రాష్ట్రానికి జస్టిస్ పీసీ ఘోష్
- బీఆర్కే భవన్‌లో ఏర్పాట్లు
- అధికారులతో భేటీ.. ప్రాజెక్టు సందర్శన

హైదరాబాద్, ఏప్రిల్4 (నమస్తే తెలంగాణ) : కాళేశ్వరం ప్రాజెక్టుపై న్యాయవిచారణ ప్రారంభంకానున్నది. న్యాయవిచారణ బాధ్యతలను పశ్చిమ బెంగాల్‌కు చెందిన విశ్రాంత న్యాయమూర్తి పీసీ ఘోష్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జస్టిస్ పీసీ ఘోష్ ఈ వారాంతంలో రాష్ట్రానికి రానున్నారని సమాచారం. న్యాయవిచారణ కోసం బీఆర్కే భవన్‌లో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల ప్లానింగ్, డిజైన్, నిర్మాణ లోపాలు, కాంట్రాక్టుల అప్పగింత తదితర అంశాలపై విచారణ చేసి 100 రోజుల్లో నివేదికను అందజేయాలని జస్టిస్ పీసీ ఘోష్‌కు మార్గదర్శకాలను జారీ చేసిన విషయం విధితమే. ఇటీవల ఇరిగేషన్‌శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా, ఈఎన్సీ నాగేందర్‌రావు ప్రత్యేకంగా కలకత్తా వెళ్లి జస్టిస్ పీసీ ఘోష్‌ను కలిసి ప్రభుత్వ మార్గదర్శకాలను అందించారు. ఈ సందర్భంగా త్వరలోనే రాష్ట్రానికి వస్తానని ఇరిగేషన్ అధికారులకు జస్టిస్ పీసీ ఘోష్ వెల్లడించారు. వరుసగా వస్తున్న ప్రభుత్వ సెలవులు ముగిసిన అనంతర వారంలో తెలంగాణకు రానున్నట్లు సమాచారం. మొత్తంగా మూడు రోజుల పాటు ఇక్కడే ఉండనున్నారు. ఇరిగేషన్ అధికారులతో సమావేశం కావడంతో పాటు ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారని సమాచారం. న్యాయవిచారణ కోసం నియమితులైన జస్టిస్ పీసీ ఘోష్‌కు సహాయంగా సీనియర్ అడ్వకేట్, జూనియర్ అడ్వకేట్, ఒక సెక్రటరీతోపాటు, చీఫ్ ఇంజినీర్‌స్థాయి ఇంజినీర్ అధికారులు, ఈఈలు, ఏఈఈలు, జేఈఈ, స్టెనోలు తదితర సిబ్బందిని కేటాయించడంతోపాటు, వసతి సౌకర్యాలను కల్పించాల్సి ఉంది. సహాయ సిబ్బంది, ఇతర ఏర్పాట్లకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి అధికారులు ఇప్పటికే పంపించారు.

ఏవోబీలో ఏపుగా గంజాయి

దేశంలో 90 శాతం అక్కడే ఉత్పత్తి

ఆపై అక్రమంగా అన్ని రాష్ట్రాలకూ రవాణా

సమూల నిర్మూలనపై ఎక్సైజ్ శాఖ దృష్టి

> అది రెండు రాష్ట్రాలకు సరిహద్దు. ఆదివాసీలు ఎక్కువగా నివసించే ఆ ప్రాంతంలో ఎక్కడ చూసినా దట్టమైన అడవులు, కొండలు, లోయలే. ప్రకృతి సొందర్యానికి నెలవైన ఆ ప్రాంతం ఇప్పుడు గంజాయి ఉత్పత్తికి అడ్డాగా మారింది. దేశంలో 90% గంజాయి అక్కడే ఉత్పత్తి అవుతున్నది. దేశంలోని అన్ని రాష్ట్రాలకు అక్కడి నుంచే అక్రమంగా గంజాయి రవాణా అవుతున్నది. అదే ఆంధ్రా-ఒడిశా బోర్డర్. సంక్షిప్తంగా ఏవోబీ.

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): ప్రకృతి రమణీయతకు నెలవైన ఆంధ్రా-ఒడిశా సరిహద్దు (ఏవోబీ) ప్రాంతంలో గంజాయి వాసన గుప్పుమంటున్నది. ఆ కంపు దేశంలోని అన్ని రాష్ట్రాలకూ విస్తరిస్తున్నది. దీంతో ఎంతో మంది యువత ఆ మత్తుకు బానిసలై చిత్తవుతున్నారు. ఉజ్వలమైన భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆ మత్తు మూలాలను కూకటివేళ్లతో పెకలించడంపై తెలంగాణ ఎక్సైజ్ శాఖ దృష్టి సారించింది. స్కూలు పిల్లలు తినే చాక్లెట్ల నుంచి పెద్దలు కాల్చే సిగరెట్ల వరకూ అన్నింటిలోనూ గంజాయి చొరబడటంతో ఇప్పటి నుంచే పటిష్ఠ చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. అందులో భాగంగా త్వరలో అన్ని రాష్ట్రాల పోలీసు, ఎక్సైజ్ విభాగాలతో జట్టు కట్టాలని భావిస్తున్నది. ఏఓబీ నుంచి ఇతర రాష్ట్రాలకు అక్రమంగా గంజాయిని తరలించేందుకు కీలకంగా ఉన్న తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో స్మగ్లర్లపై ఎక్కడికక్కడ ఉక్కుపాదం మోపుతున్నది. దేశంలో 90% గంజాయి ఏవోబీలోనే ఉత్పత్తి అవుతుండటంతో దాన్ని కట్టడి చేయడంలో ఆంధ్రా, ఒడిశా అధికారుల సహకారాన్ని తీసుకునేందుకు తెలంగాణ అధికారులు సిద్ధమవుతున్నారు.

15 వేల ఎకరాల్లో గంజాయి సాగు

గంజాయి ఉత్పత్తికి ఏవోబీ కేరాఫ్‌గా మారడంతో సరిహద్దు రాష్ట్రాల పోలీసులు, ఎక్సైజ్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఈ ఒక్క ప్రాంతంలోనే దాదాపు 10 వేల నుంచి 15 వేల ఎకరాల్లో గంజాయి సాగు అవుతున్నట్టు అంచనా. ఏవోబీలో గంజాయి సాగుకు భౌగోళిక, వాతావరణ పరిస్థితులు అనువుగా ఉండటంతోపాటు మావోయిస్టులు సంచరించే ప్రాంతం కావడంతో స్మగ్లర్లు ఆ ప్రాంతాన్నే తమ అడ్డాగా చేసుకుంటున్నారు. ఏవోబీలోని ప్రతి గ్రామంలో వరి, పసుపు, కంది, శనగ, మినప, పెసర పంటలకు తోడుగా గంజాయి మొక్కలను పెంచుతున్నారని, సాధారణ పంటల కంటే గంజాయి సాగు ఎంతో లాభసాటిగా ఉండటమే ఇందుకు కారణమని ఎక్సైజ్ అధికారులు చెప్తున్నారు.

హాట్‌స్పాట్‌లుగా ఢిల్లీ, గుజరాత్

ఏఓబీ నుంచి తొలుత చింతూరు-భద్రాచలం మీదుగా తెలంగాణకు గంజాయిని తరలిస్తున్న స్మగ్లర్లు.. ఇక్కడి నుంచి ఢిల్లీ, గుజరాత్, మహారాష్ట్ర, ఏపీ, తెలంగాణ, తమిళనాడు, ఒడిశా, కేరళ, కర్ణాటక, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, పశ్చిమ బెంగాల్, సిక్కిం, నాగాలాండ్ తదితర రాష్ట్రాలకు అధికంగా గంజాయి రవాణా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దుల వద్ద నిఘాను మరింత కట్టుదిట్టం చేసినట్టు అధికారులు చెప్తున్నారు.

సగం జొన్నలే కొంటం

మొదటిపేజీ తరువాయి...

ఎకరాల విస్తీర్ణంలో జొన్న సాగవగా, 1.83 లక్షల టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా. కనీస మద్దతు ధర క్వింటాకు రూ.3,180 కాగా, మార్కెట్‌లో మాత్రం వ్యాపారులు రూ.2,400కే కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం 91,865 టన్నుల కొనుగోలుకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో మిగతా పంటను నష్టానికే అమ్ముకోవాల్సి వస్తుందని రైతుల్లో ఆందోళన నెలకొన్నది. మొత్తం పంటను మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలనే వారు కోరుతున్నారు. అన్ని పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తామన్న గత ఎన్నికల హామీని నెరవేర్చాలని కాంగ్రెస్ పార్టీని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

లక్ష్మీ కెనాల్‌కు నీళ్లివ్వండి

పంటలను ఎండబెట్టడం సరికాదు • అధికారులకు మాజీ మంత్రి వేముల విజ్ఞప్తి

మోర్తాడ్, ఏప్రిల్ 4: నీటి కేటాయింపులు లేని ప్రాంతానికి నాలుగు టీఎంసీల నీటిని వదిలి.. నీటి కేటాయింపులు ఉన్న లక్ష్మీ కెనాల్ ప్రాంతంలోని పంటలు ఎండబెట్టడం సరికాదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఉన్న మండలానికి ఆయువుపట్టు అయిన లక్ష్మీ కెనాల్‌కు నీటి విడుదలను నిలిపివేస్తే రైతులు ఇబ్బందులు పడుతారని చెప్పారు. పది రోజులపాటు రోజుకు 300 క్యూసెక్కుల చొప్పున 0.3 టీఎంసీల నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని ఎస్సారెస్పీ ఎస్ఈ, సీఈలను ఆయన కోరారు. ముప్కాల్ మండలానికి చెందిన రైతులు గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో వేములను కలిశారు. లక్ష్మీ కాలువకు నీటిని విడుదల చేయించాలని, చివరి తడికి నీళ్లు లేకపోతే పంటలు ఎండిపోతాయని గోడు వెల్లబోసుకున్నారు. స్పందించిన ప్రశాంత్‌రెడ్డి.. రైతుల ముందే అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. తనతోపాటు రైతులు ఎన్నిసార్లు చెప్పినా వినకుండా కాంగ్రెస్ ప్రభుత్వం.. నీటి అలకేషన్ లేని ప్రాంతాలకు వరదకాలువ ద్వారా 4 టీఎంసీల నీటిని కిందికి వదిలిందని వివరించారు. అలకేషన్ ఉన్న లక్ష్మీ కెనాల్‌కు నీటిని విడుదలను నిలిపివేసి, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి, నవాబ్‌లిఫ్ట్‌ల ఆయకట్టు రైతన్నలకు సాగునీరు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం సరికాదని చెప్పారు. రైతుల కోరిక మేరకు లక్ష్మీ కెనాల్‌కు నీటి విడుదల కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

నాడు ఎగువకు ఎదురెక్కిన కాళేశ్వర జలాలతో కళకళలాడుతున్న సిరిసిల్ల మానేరు వంతెన ప్రాంతం (ఫైల్)

నేడు చుక్క నీరు లేక వెలవెలబోతున్న సిరిసిల్ల మానేరు వంతెన ప్రాంతం